విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలి



విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

ములుగు, డిసెంబర్ 15: కండ్లకలకతో బాధ పడుతున్న విద్యార్థులకు వెంటనే మెరుగైన చికిత్స అందించాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ములుగులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఆదివారం ఆయన సందర్శించారు. కండ్లకలకతో బాధపడుతున్న విద్యార్థులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గురుకుల పాఠశాల విద్యార్థుల సంక్షేమాన్ని రేవంత్‌రెడ్డి సర్కార్ గాలికి వదిలేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలోపలికి అనుమతించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో గురుకుల పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు.

హామీ అమలుచేయకుంటే ప్రజాభవన్ ముట్టడిస్తాం



సిద్దిపేటలో మాట్లాడుతున్న నాయకులు

సిద్దిపేట, డిసెంబర్ 15: ముదిరాజులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయకుంటే ప్రజా భవన్, ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ హెచ్చరించారు. ఆదివారం సిద్దిపేటలోని ముదిరాజ్ ఏసీ కన్వెన్షన్ హాల్‌లో ముదిరాజ్ హక్కుల సాధన సమితి సభ్యులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ముదిరాజులకు జరుగుతున్న అన్యాయాలపై చర్చించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరాలు మారినా ముదిరాజుల తలరాతలు మారడం లేదలని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మారుస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముదిరాజులకు ఉచిత చేప పిల్లలు ఇచ్చి ఆదుకున్నారని రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఏమీ రావడం లేదన్నారు. ముదిరాజ్ హక్కుల సాధనే ధ్యేయంగా ముదిరాజ్ హక్కుల సాధన సమితి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ హక్కుల సాధన సమితి యూత్ రాష్ట్ర అధ్యక్షుడు పడిగె ప్రశాంత్, రాగుల రాజు, గౌరవేని సుమన్, పడిగె లింగం, గౌరవేని కిషన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

గురుకుల పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

చేర్యాల, డిసెంబర్ 15: చేర్యాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ చేర్యాల మండల కార్యదర్శి ఎస్‌కే యాసిన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక గురుకుల పాఠశాలలో సర్వే చేసేందుకు ఏఎస్ఎఫ్ నాయకులు హాస్టల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ప్రిన్సిపాల్ పర్మిషన్ లేదని నిరాకరించడంతో హాస్టల్ గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో అనేక అవినీతి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రిన్సిపాల్ కూడా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాసిరకం ఆహారాన్ని అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు పెట్టాల్సిన ఆహారపదార్థాలు దొడ్డిదారిన బయటకు వెళ్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర హోంశాఖ సహాయమంత్రిని కలిసిన కలెక్టర్

బండి సంజయ్‌కి మొక్క అందజేస్తున్న కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబర్ 15: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ని ఆదివారం హరిత మినర్వా హోటల్‌లో కలెక్టర్ మనుచౌదరి మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. జిల్లాలోని ఓ వివాహ విందులో ఆయన పాల్గొనడానికి వచ్చారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ మధు తదితరులు హాజరయ్యారు.

నిత్యావసర వస్తువులు అందజేత

మహిళకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న అందె విజయ్

చేర్యాల, డిసెంబర్15: చేర్యాల పట్టణంలో పది రోజుల నుంచి మతిస్థిమితం లేని మహిళ ఒంటరిగా ఇబ్బందులు పడుతున్నది. స్థానికులు పట్టణానికి చెందిన అందె విజయ్‌కి సమాచారం ఇచ్చారు. ఆదివారం ఆ మహిళకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఆమెను సురక్షితమైన ప్రాంతానికి పంపించనున్నట్లు ఆయన తెలిపారు. మానవత దృక్పథంతో మతిస్థిమితం లేని మహిళకు నిత్యావసర వస్తువులు అందజేసిన విజయ్‌ను పలువురు అభినందించారు.

గౌతమి హాస్టల్‌పై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న భరత్‌కుమార్

చేర్యాల, డిసెంబర్ 15: చేర్యాల పట్టణంలోని గౌతమి ఎడ్యుకేషన్ సొసైటీ హాస్టల్‌పై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ అధికారులు హాస్టల్‌ను సందర్శించాలన్నారు. హాస్టల్‌లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడం లేదని, మౌలిక సౌకర్యాలు లేక విద్యార్థులు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు వసతులు కల్పించడంలో హాస్టల్ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు గౌతమి హాస్టల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సంజు, అఖిల్, రంజిత్, రాజు పాల్గొన్నారు.

వరి నాట్లు షురూ..

నర్సాయపల్లిలో నాటు వేస్తున్న మహిళలు

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 15: ఉమ్మడి మద్దూరు మండలంలోని వివిధ గ్రామాల్లో యాసంగి వరినాట్లు షురూ అయ్యాయి. నిన్నమొన్నటి దాకా వర్షాకాలం వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు తిరిగి యాసంగి సాగు పనులు మొదలు పెట్టారు. ఆలస్యంగా వరినాట్లు ప్రారంభిస్తే వేసవిలో కరెంట్ కష్టాలు పడాల్సి వస్తుందని రైతులు ముందోస్తుగా ప్రారంభించారు. ఇప్పటికే రైతులు మక్క పంటను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో సాగు సందడి ఆరంభమైంది. ఉమ్మడి మద్దూరు మండలంలో గతేడాది యాసంగిలో 16750 ఎకరాల్లో వరి సాగు చేయగా ఈ ఏడాది 1865 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

అసంపూర్తి పనులు పూర్తయ్యేనా?

గజ్వేల్‌లో ముందుకు సాగని అసంపూర్తి పనులు

- వర్గల్ మార్గంలో 60మీటర్ల ఓఆర్ఆర్ పనులు పెండింగ్
- ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్న వ్యాపారులు, దుకాణాదారులు
- పనులు పూర్తయితే ప్రయోజనం అంటున్న ప్రజలు
- గజ్వేల్ అభివృద్ధిపై నీలినీడలు

వర్గల్ వెళ్లే మార్గంలో పెండింగ్‌లో రింగ్‌రోడ్డు పనులు

వర్గల్ కమాన్ వద్ద పూర్తికాని డబుల్ రోడ్డు పనులు

గజ్వేల్, డిసెంబర్ 15: అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో పట్టణవాసుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా గజ్వేల్‌లో అసంపూర్తిగా మిగిలిన పనులు ముందుకు సాగడం లేదు. గజ్వేల్ మున్సిపల్ పరిధి చుట్టూ నిర్మించిన రింగ్ రోడ్డు పనుల్లో భాగంగా వర్గల్ వెళ్లే మార్గంలో రింగ్ వద్ద 60మీటర్ల రోడ్డు పనులు పెండింగ్‌లో ఉండడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లే భారీ వాహనాలతో గజ్వేల్ పట్టణవాసులకు ట్రాఫిక్ సమస్యగా మారుతుంది. గజ్వేల్ మీదుగా రోజూ వందల సంఖ్యలో చెన్నై, బెంగళూరు, నల్లగొండ, సూర్యాపేట, చిట్యాల ప్రాంతాల నుంచి భారీ కంటైనర్లు ముంబయి, పుణెలకు నిజామాబాద్ మీదుగా అధిక సంఖ్యలో వెళ్తుంటాయి. గజ్వేల్ చుట్టూ నిర్మించిన 23కిలోమీటర్ల రింగ్‌రోడ్డు పనులు పూర్తయితే వాహనదారులతోపాటు పట్టణవాసులకు ఎంతో మేలు చేకూరుతుంది. వర్గల్ వెళ్లే మార్గంలో 60మీటర్ల రింగ్‌రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపితే వాహనదారులకు భారీ ఊరట లభిస్తుంది. రైల్వేశాఖ నిర్మించాల్సిన 1.6 కిలోమీటర్ల రైల్వే బ్రిడ్జి పనులు సాగుతున్నా వర్గల్ రింగ్ రోడ్డు పనులు మాత్రం సాగటం లేదు. వర్గల్ కామన్ నుంచి సంగాపూర్ వెళ్లే మార్గంలో కూడా సుమారు 100మీటర్ల డబుల్ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉండడంతో రోజూ ట్రాఫిక్ సమస్యతో వ్యాపారులు, దుకాణదారులు ఇబ్బందిపడుతున్నారు. గజ్వేల్ చుట్టూ 23 కిలోమీటర్ల రింగ్ రోడ్డుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.230కోట్లు మంజూరు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్‌లోని పెండింగ్ పనులపై దృష్టి సారించడం లేదు.

డ్రగ్స్‌ను తరిమికొడదాం

కొండాపూర్‌లో యువకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, డిసెంబర్ 15 : డ్రగ్స్‌ను గ్రామాల నుంచి తరిమికొడదామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రన్ ఫర్ డ్రగ్స్ వ్యవస్థాపక చైర్మన్ తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. రన్ ఫర్ డ్రగ్స్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొండాపూర్‌లోని యువకులతో కలిసి 2 కే రన్ నిర్వహించారు. మత్తు పదార్థాలు సేవించరాదని గ్రామస్తుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ వైరస్ కంటే ప్రమాద కరమైన మత్తు పదార్థాలను యువత సేవించి తమ కుటుంబాలను ఆగం చేయవద్దని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కవితా రాజు, బాల్‌రాజు, బాల్ నర్సయ్య, ఆయా పార్టీల నాయకులు అంజిరెడ్డి, రాజేశం, దేవరాజు, టెలికం బోర్డు మెంబర్ మల్లేశం, నాయకులు ఐలయ్య, భైరయ్య, కుమార్, అమర్, అహ్మద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అరుణవర్ణంలో ఆదిత్యుడు

మంచు పొరల్ని చీల్చుకుంటూ అరుణవర్ణాన్ని పులుముకున్న మేఘాల్లోంచి భాస్కరుడు దివి నుంచి భువికి పల్లెను పలకరించడానికి వస్తున్నాడు. నులివెచ్చని రవి కిరణాలు తాకి ప్రకృతి, పశుపాదులు, పులకరించిన నేల.. అప్పుడే తెలవారిందని గ్రామీణ జనం మేలుకుంటున్న వేళ.. ఈ అపురూప దృశ్యాన్ని 'నమస్తే తెలంగాణ' ఆదివారం క్లిక్ మనిపించింది. – కొమురవెల్లి, డిసెంబర్ 15

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ రాష్ట్ర కార్యదర్శిగా బాలబ్రహ్మం

విశ్వకర్మ రాష్ట్ర కార్యదర్శిగా నియామక పత్రం అందుకుంటున్న బాలబ్రహ్మం

కొండాపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 15: విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని తిమ్మారెడ్డి పల్లి మాజీ సర్పంచ్ భూర్గోజు బాలబ్రహ్మంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ ఆచార్యులు బాలబ్రాహ్మంకు నియామక పత్రం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ నాయకులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

వర్గల్,డిసెంబర్15: వర్గల్ నవోదయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నవోదయ ప్రాంగణానికి కొత్త కళతెచ్చింది. నవోదయ విద్యాలయం స్థాపించినప్పటి నుంచి 2022-23 విద్యా సంవత్సరం వరకు అన్ని విద్యాసంవత్సరాలకు సంబంధించి 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈసందర్భంగా నవోదయలో చదువుతున్న ప్రస్తుత విద్యార్థులు పూర్వ విద్యార్థులకు ఘనస్వాగతం పలికారు. ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 2025 సంవత్సరం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. చదువులో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొమురవెల్లిలో భక్తుల సందడి

గంగరేగు చెట్టు వద్ద భక్తుల రద్దీ

చేర్యాల, డిసెంబర్ 15: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మల్లన్నను దర్శించుకున్నారు. ఆలయంలో అర్చకులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, ఒగ్గు డోళ్ల విన్యాసాల మధ్య మహిళలు బోనాలు తీసుకువెళ్లి మల్లన్నస్వామికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులు గంగరేగు చెట్టు వద్ద పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. గుట్టపైన ఉన్న రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు సమర్పించారు. 12వేల మందికిపైగా భక్తులు మల్లన్నను దర్శించకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

మందుబాబుల ఇష్టారాజ్యం

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఆకునూరులో చెత్తాచెదారంతో నిండిపోయిన కమ్యూనిటీ భవనం

చేర్యాల, డిసెంబర్ 15: మండలంలోనే మేజర్ గ్రామ పంచాయతీ ఆకునూరులో మందుబాబులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ నడిబొడ్డున అసంపూర్తిగా ఉన్న గౌడ కమ్యూనిటీ భవనంలో నిత్యం మందుబాబులు మద్యం తాగిసీసాలు అక్కడే వదిలేస్తున్నారు. సిగరేట్లు తాగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కమ్యూనిటీ భవనానికి సమీపంలో ఉన్న ఓ బెల్ట్‌షాపు వేకువజాము నుంచి రాత్రి 12గంటలకు వరకు తెరిచిఉంటుంది. గ్రామ మధ్యలో ఉన్న భవనంలో మందుబాబులు ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు మద్యం తాగుతున్నారు. భవనానికి ఇరుపక్కల నివాస గృహాల్లో ఉన్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు సమీపంలో ఉన్న బెల్ట్‌షాపు నిత్యం ఒక బారును తలపిస్తున్నట్లు కొనసాగుతున్నా నియంత్రించేందుకు సంబంధితశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. బెల్ట్‌షాపు నిర్వాహకులు సంబంధితశాఖ అధికారులకు నెలవారి మామూళ్లు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అటువైపు మహిళలు, బాలికలు వెళ్లాలంటే జంకుతున్నారు.అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవనంలో మందు తాగడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని పలువురు సంబంధిత శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోవడం లేదు. కలెక్టర్ లేదా కమిషనర్ ఆఫ్ పోలీస్ స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని నివాసగృహాల ప్రజలు కోరుతున్నారు.

'పటేల్' విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

వల్లభాయ్ పటేల్ విగ్రహం ఏర్పాటుకు భూమి చేస్తున్న నాయకులు

గజ్వేల్, డిసెంబర్ 15: గజ్వేల్ పట్టణంలోని ఎయిర్‌టెల్ టవర్ వద్ద గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రోడ్డు డివైడర్ మధ్యలో దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, డాక్టర్ నరేశ్‌బాబు, నాయకులు నాయిని యాదగిరి, బోస్, రహీం, మల్లేశం, మధు, బుక్క రమేశ్, బాలకుమార్, అరవింద్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేదిక సభ్యులు

సిద్దిపేట టౌన్,డిసెంబర్ 15: అహల్యాబాయి హోల్కర్ 300 వందల ఏండ్ల క్రితమే మహిళల సాధికారత కోసం కృషి చేశారని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు.అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతిని పురస్కరించుకొని సిద్దిపేటలో ఆదివారం లోకమాత అహల్యాబాయి హోల్కర్ పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అరవింద్, రమేశ్, రాజశేఖర్‌రెడ్డి, మనోహర్, సంతోష్‌కుమార్, యాదగిరి, మల్లారెడ్డి పాల్గొన్నారు

గ్రూప్-2 పరీక్షలు షురూ...



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభ్యర్థులను తనిఖీ చేసి పంపిస్తున్న పోలీసులు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 15: టీజీపీఎస్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి మొదటి రోజు జరిగిన పేపర్-1, పేపర్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ ఎం.మను చౌదరి తెలిపారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో 37 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరిగిన పేపర్-1 పరీక్షకు మొత్తం 13,717 మంది అభ్యర్థులకు 51.06 శాతంతో 7,005 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన పేపర్-2 పరీక్షకు 50.70 శాతంతో 6,955 మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. సిద్దిపేట పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ మనుచౌదరి ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి..ఎన్ని గంటలకు పరీక్షా కేంద్రాలకు పేపర్లు వచ్చాయి, ఎంత మంది హాజరయ్యారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పరిశీలించి ఏమైనా సాంకేతిక సమస్యలు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరిగే పేపర్-3, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగే పేపర్-4 పరీక్షలకు సైతం అభ్యర్థులు నిర్ణీత సమయానికి చేరుకొని ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు.

సిద్దిపేటలో హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ...

గ్రూప్-2 ఎగ్జామ్ కోసం పరుగులు తీస్తున్న అభ్యర్థులు

నేడు ప్రజావాణి రద్దు

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబర్15: సోమవారం గ్రూప్-2 పరీక్షలు ఉన్నందున కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ మనుచౌదరి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు ఎవరూ రావద్దని సూచించారు.

కమ్మేసిన పొగ మంచు

మిరుదొడ్డిలో ఇండ్లను కమ్మేసిన పొగ మంచు

మిరుదొడ్డి, డిసెంబర్ 15 : మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఉదయం పొగ మంచు కమ్మేసింది. మిరుదొడ్డిలో ఉదయం 8 గంటలు దాటినా పొగమంచు కమ్మేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాహన దారులు లైట్లు వేసుకొని ప్రయాణాలు కొనసాగించారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), డిసెంబర్ 15 : అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతెలో ఆదివారం మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా చాకలి కనుకయ్యకు రూ.27 వేలు, బొల్లు మల్లయ్యకు రూ.17 వేల చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంజిత్, బాల్‌నర్సాగౌడ్, రామస్వామి, బుచ్చులు, కిషన్, పొచయ్య పాల్గొన్నారు.

గుర్తు తెలియని జంతువు దాడిలో దూడ మృతి

కొండపాక (కుకునూరుపల్లి), డిసెంబర్ 15: కొండపాక మండలం జప్తినాచారంలో మాష్టి పరశురాములుకు చెందిన దూడపై గుర్తుతెలియని జంతువుదాడి చేయడంతో మృతిచెందింది. గ్రామస్తులు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ పాటు అటవీఅధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అటవీ అధికారులు దూడపై దాడి చేసింది హైనా లేదా మరో జంతువా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దచెరువు కట్టపై గుంతలు

- ఇబ్బందులు పడుతున్న వాకర్స్
- మరమ్మతులు చేపట్టాలని డిమాండ్

చేర్యాలలోని పెద్దచెరువు కట్టపై ఏర్పడిన గుంతలు

చేర్యాల, డిసెంబర్ 15 : చేర్యాల పట్టణానికి చెందిన చిన్నారులు మొదలుకుని పెద్దల వరకు నిత్యం పెద్ద చెరువు కట్ట పై వాకింగ్, జాగింగ్, రన్నింగ్ చేస్తూ ఆరోగ్యాలను కాపాడుకుంటున్నారు. పెద్ద చెరువు కట్ట పై నిత్యం వాకర్స్ వస్తుండడంతో స్థానిక మున్సిపల్ పాలకవర్గం సైతం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసింది. ఇటీవల పెద్ద చెరువు కట్ట పై గుంతలు ఏర్పడడంతో వేకువజాము ఐదు గంటలకే వాకింగ్ వచ్చే వారితో పాటు జాగింగ్ చేసే వారు మొదలుకుని వాకర్స్ సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద చెరువు కట్ట పై తేలి ఉన్న రాళ్లకు తోడు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాకర్స్‌కు గాయాలయ్యాయి. పెద్ద చెరువు కట్ట పై కొన్ని సంవత్సరాలుగా వాకింగ్ చేస్తున్న వారు సైతం రాళ్లు, గుంతల వల్ల పట్టణంలోని జనగామ, సిద్దిపేట ప్రధాన రహదారి పై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాకింగ్ చేస్తున్నారు. పెద్ద చెరువు కట్ట సుందరీకరణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఖర్చు చేసి కట్టకు మరమ్మతులు చేస్తే ప్రజల ఆరోగ్యాలు కాపాడిన వారవుతారని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం పెద్ద చెరువు కట్ట పై వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని పెద్ద చెరువు కట్ట వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు.

పెద్దచెరువుకట్టకు మరమ్మతులు చేయాలని కోరుతున్న వాకర్స్ సభ్యులు